

సీఎం రాక రేపు

- రెన్యువబుల్ ఎనర్జీ సదస్సుకు హాజరు
- పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి
- పలు పరిశ్రమలకు శంకుస్థాపన

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 13వ తేదీన విశాఖ నగరానికి రానున్నారు. ఆ రోజు ఉదయం పది గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 10.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు ... మిగతా 4వ పేజీలో

కూటమి పాలనపై సానుకూలత

మెజారిటీ ప్రజల్లో సంతృప్తి

- పెన్షన్ పెంపు, గ్రామీణ రహదారులు బాగుపడడంపై అత్యధికుల్లో సంతోషం
- గత ప్రభుత్వంతో పోలిస్తే పాలన సాఫీగా సాగుతుందన్న ప్రైవేటు ఉద్యోగి
- నూకాంబిక జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు గొప్ప విషయమన్న అనకాపల్లి వాసి
- అన్న క్యాంటీన్ ఆకలి తీరుస్తున్నదని రిక్షా కార్మికుడి ఆనందం
- రోజు పని లభిస్తున్నదంటున్న భవన నిర్మాణ కార్మికులు
- మిశ్రమ స్పందన వెలిబుచ్చిన మరికొందరు
- సంక్షేమ పథకాలన్నీ అమలు చేయకపోయినా, ప్రభుత్వ నిర్ణయాలు బాగున్నాయని కితాబు
- హామీలన్నీ ఇంకా పూర్తిగా నెరవేర్చలేదని ఇంకొందరి అసంతృప్తి
- రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది



ఏడాది క్రితం ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నప్పటి చిత్రం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో సానుకూలత కనిపిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలపై మెజారిటీ ప్రజలు సంతృప్తితో, ఉన్నారు. కొందరు మాత్రం పథకాలు సరిగా అమలు చేయడం లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వంలో కొన్ని రకాల భయాలు, ఆందోళనలు ఉండేవని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని మరికొంతమంది అన్నారు. ఇప్పటికే కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారని, మరికొన్నింటిని అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని, అందుకు మరింత సమయం ఇవ్వాలని ఇంకొందరు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే అత్యధికులు సంతృప్తిని, కొందరు అసంతృప్తిని వ్యక్తంచేయగా, ఇంకొందరు పర్వాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై గురువారం నాటికి ఏడాది అవుతోంది. ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. వివిధ వర్గాలకు చెందిన వారి అభిప్రాయాలను సేకరించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, మద్యం, ఇసుక వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజలు సమర్థిస్తున్నారు. వీటితోపాటు రాష్ట్రాన్ని చంద్రబాబునాయుడు అభివృద్ధి బాటలో నడిపేందుకు శ్రమిస్తున్న తీరు పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఇప్పుడు రాష్ట్రంలో పాలన సజావుగా సాగుతున్నదని, అయితే కొన్ని సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అనకాపల్లికి చెందిన ప్రైవేటు ఉద్యోగి పెంటకోట ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం బాగుందన్నారు. అనకాపల్లి గుండాల వీధికి చెందిన బందిలి నారాయణ.. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ముఖ్యంగా అత్యంత దారుణంగా ఉన్న గ్రామీణ రహదారులను బాగు చేయించి ప్రజల కష్టాలు తీర్చిందని అభిప్రాయపడ్డారు. రేషన్ కోసం ఎండీయూ వాహనం వద్ద పడిగాపులు పడాల్సిన బాధ తప్పిందని, రేషన్ డిపోకు ఎప్పుడైనా వెళ్లి సరుకులు ... మిగతా 4వ పేజీలో

వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం



వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తున్నది. గత ప్రభుత్వం సబ్సిడీపై ఎటువంటి పరికరాలు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు కావాల్సిన పలు రకాల పరికరాలు రాయితీపై అందుతున్నాయి. సబ్సిడీపై పశుదాణా ఇస్తున్నారు. పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు రాయితీ రుణాలపై పాడి పశువులు అందజేస్తే బాగుంటుంది.

- అడిగర్ల నూకరాజు, రైతు, కె.నాయుడుపాలెం, రేలుగుంట మండలం

రోజూ కూలి పని లభిస్తున్నది



గత ప్రభుత్వం హయాంలో ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ పనులు కుంటుపడ్డాయి. ఏ రోజు పని వుంటుందో తెలియని పరిస్థితి వుండేది. నెలలో సగం రోజులు పనులు ఉండేవి కావు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టారు. రోజూ పని వుంటున్నది. గత ప్రభుత్వంలో రేషన్ తీసుకోవడానికి ఒక రోజు పని మానుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. చంద్రబాబునాయుడు పాలన బాగుంది.

- గుర్రం గోవిందు, భవన నిర్మాణ కార్మికుడు, మార్టూరు, అచ్యుతాపురం

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

తొలిరోజునే 'విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీ

- రెండు, మూడు రోజుల్లో యూనిఫారం, బూట్లు
- సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

అనకాపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. బుధవారం ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను సందర్శించి తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆవరణను శుభ్రం చేయించారు. చిన్నాచితకా మరమ్మతు పనులు పూర్తి చేశారు. జిల్లాలో 1,033 ప్రాథమిక పాఠమిక పాఠశాలల్లో 23,194 మంది, 148 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 9,232 మంది, 226 ఉన్నత పాఠశాలల్లో 61,038 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం విద్యార్థులకు 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరుతో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, బ్యాగులు, యూనిఫారంతో కిట్‌లను విద్యార్థులకు అందజేయనుంది. జిల్లాకు అవసరమైన 5.13 లక్షల పాఠ్య పుస్తకాలు, 6.9 లక్షల నోట్ పుస్తకాలు, 9,784 నిఘంటువులు, 60,910 బెల్టులు ఇప్పటికే పాఠశాలలకు చేరాయి. గురువారం నుంచి వీటిని విద్యార్థులకు అందజేయనున్నారు. యూనిఫారమ్, బూట్లు జిల్లా కేంద్రానికి చేరాయి. రెండు, మూడు రోజుల్లో వీటిని కూడా పాఠశాలలకు చేర్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తరగతి గదులను సిద్ధం చేయాలని ఎంఈవోలను ఆదేశించామని డీఈఓ గిడ్డి అప్పారావునాయడు తెలిపారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఏరువాక సాగారో...



చోడవరం మండలం లక్ష్మీపురంలో దుక్కి దున్ని ఏరువాకను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

ఏరువాక పౌర్ణమిని అన్నదాతలు ఘనంగా నిర్వహించారు. ఎద్దులు, నాగళ్లకు పసుపు, కుంకుమ పూసి, పువ్వులతో అలంకరించారు. పొలాలకు వెళ్లి ఈ ఏడాది పంటలు బాగా పండాలని నేత తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం దుక్కులు దున్ని, విత్తనాలు చల్లారు. మంత్రి అనిత, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, కేఎస్ఎన్ఎస్ రాజు.. తమ నియోజవర్గాల పరిధిలో ఏరువాక కార్యక్రమాలకు హాజరై, రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.



ఎక్స్‌కవేటర్‌తో కొండను తవ్వుతున్న దృశ్యం

కొత్తపోలవరంలో గ్రావెల్ దందా

పట్టపగలు యంత్రాలతో కొండను తవ్వేస్తున్న అక్రమార్కులు

- రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇతర అవసరాలకు గ్రావెల్ తరలింపు
- అనుమతులు లేవంటున్న తహశీల్దారు



గుట్టగా పోసిన గ్రావెల్, రాళ్లు

ఎస్.రాయవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రావెల్ దొంగలు బరితెగిస్తున్నారు. మండలంలోని కొత్తపోలవరం కొండపై బుధవారం పట్టపగలు ఎక్స్‌క వేటర్‌తో గ్రావెల్ తవ్వుతున్నారు. గ్రావెల్‌ను పెద్ద మొత్తంలో కుప్పగా నిల్వచేస్తున్నారు. చీకటి పడిన తరువాత ట్రాక్టర్లలోకి లోడింగ్ చేసి చట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రైవేటు లేఅవుట్లలో రోడ్ల నిర్మాణానికి, ఇళ్ల పునాదులు నింపడానికి తరలిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్ రూ.3-4 వేలు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. కాగా కొత్తపోలవరం కొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాల విషయాన్ని తహశీల్దారు జె.రమేశ్‌బాబు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకురాగా.. సదరు కొండపై గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. కొండపై తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పేటలో రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

- బల్క్‌డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంటుతో వేలాది మందికి ఉద్యోగాలు
- హోం మంత్రి వంగలపూడి అనిత



టీడీపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వి.అనిత

పాయకరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంలో పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం ఇక్కడ రాజుగారి బీడులో నూతనంగా ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనికూడా జరగలేదని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులు, వంతెనలు, భవనాల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డును రూ.4 కోట్లతో త్వరలో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు, స్టీల్‌ప్లాంటు ఏర్పాటు కాబోతున్నాయని, వీటిల్లో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అభిస్తాయని మంత్రి చెప్పారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని ఆమె స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యుడు పెంకే గోవిందు తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడుతోపాటు కూటమి నాయకులు తోట నగేశ్, ఎం.రమాకుమారి, చించెలపు ప్రదీప్, గింజాల లక్ష్మణరావు, పెట్ల లింగంనాయుడు, అమలకంట అబద్దం, యాళ్ల వరహాలబాబు, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

నేటి నుంచి పక్కాగా అమలు

- విక్రయించే గోదాములు, షాపులను సీజ్ చేస్తాం
- వ్యాపారులకు మునిసిపల్ కమిషనర్ సురేంద్ర హెచ్చరిక



మాట్లాడుతున్న కమిషనర్ సురేంద్ర (మధ్యలో..)

నర్సీపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, నిషేధిత పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తే గోదాములు, షాపులను సీజ్ చేస్తామని కమిషనర్ జంపా సురేంద్ర హెచ్చరించారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. పాలిథిన్ కవర్లు వాడద్దని సామాన్య ప్రజలను కోరితే... ముందు హోల్‌సేల్ దుకాణాల్లో అమ్మకుండా చేయాలని అడుగుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయ సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. గురువారం నుంచి 120 మైక్రాన్లలోపు మందం వున్న పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తే గోదాములు, షాపులను సీజ్ చేస్తామన్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ.. వ్యాపారులు గడువు కోరుతుంటే చాలా సార్లు అవకాశం ఇచ్చామని, ఇకపై గడువు పొడిగించేది లేదని, ప్లాస్టిక్ నిషేధం అమలు విషయంలో నిక్కచ్చిగా వుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే గోదాముల్లో ఉన్న ప్లాస్టిక్‌ను వేరే ఎక్కడికైనా తరలించాలని సూచించారు.

ఫార్మా కంపెనీ బస్సు దగ్ధం

డీజిల్ ట్యాంకు లీక్ కావడంతో ఘటన

- బస్సులో ఉద్యోగులు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం



దగ్ధమవుతున్న బస్సు

తుమ్మపాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి- చోడవరం రోడ్డులో అనకాపల్లి మండలం బవులవాడ వద్ద బుధవారం ఒక ఫార్మా కంపెనీకి ఉద్యోగులను తరలించే ప్రైవేటు బస్సు దగ్ధమైంది. ఈ సమయంలో బస్సులో ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి.**

పరవాడలోని విశాఖ ఫార్మా సిటీలో లారస్ ల్యాబ్స్ కంపెనీకి ఉద్యోగులను తీసుకెళ్లేందుకు ఒక బస్సు ఉదయం 11.30 గంటల సమయంలో లంకెలపాలెం నుంచి చోడవరం వైపు వెళ్తున్నది. బవులవాడ వద్దకు వచ్చే సరికి బస్సులో నుంచి అగస్మాత్తుగా మంటలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ మల్లవరపు కొండబాబు బస్సును రోడ్డు పక్కకు తీసి ఆపి కిందకు దిగేశాడు. స్థానికుల సహకారంతో అగ్నిమాపక కార్యాలయానికి సమాచారాన్ని అందించాడు. కొద్దిసేపటికే అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే దాదాపు 80 శాతం దగ్ధమైంది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రూరల్ ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ, బస్సు ఆయిల్ ట్యాంకు లీకేజీ కారణంగా ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పూర్తి సమాచారాన్ని సేకరించి కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు. కాగా బస్సు దగ్ధం కారణంగా ఈ రోడ్డులో దాదాపు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తహశీల్దార్ల బదిలీలు

- పలువురు డీటీలకు స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న బి.సుధాకర్‌ను నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. సెలవులో ఉన్న కశింకోట తహసీల్దారు అడబాల శ్రీనివాసరావును అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా నియమించారు. మునగపాక తహశీల్దారు ఎస్‌వి మహేశ్వరరావును పాయకరావుపేటకు, అక్కడ పనిచేస్తున్న జి.సత్యనారాయణ అచ్యుతాపురానికి బదిలీ చేశారు. రావికమతం తహశీల్దారు వెంకటరమణను మాకవరపాలేనికి, పరవాడ తహశీల్దారు ఎస్‌వీ అంబేడ్కర్‌ను రావికమతానికి, అనకాపల్లి తహశీల్దారు కె.విజయ్‌కుమార్‌ను కలెక్టరేట్ ఏఓగా బదిలీ చేశారు. ఏఎస్ఆర్ జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాకు కేటాయించిన ఎంటీ అప్పారావును అనకాపల్లి తహశీల్దారుగా, బి.నాగరాజును పరవాడకు, సీహెచ్ తిరుమలరావును కశింకోటకు నియమించారు. విశాఖ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎం.ఆనందకుమార్‌ను మునగపాక, ఎం.భుజంగరావును కె.కోటపాడు మండలాలకు తహశీల్దార్లుగా నియమించారు.

డిప్యూటీ తహశీల్దార్లు..

అల్లూరి సీతారామరాజు, విశాఖ ... మిగతా 4వ పేజీలో



గెడ్డపాలెంలో కాడెడ్లకు పూజ చేస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

రైతులకు ఆధునిక పరికరాలు

▸ ఏరువాక పౌర్ణమి వేడుకల్లో హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీకి అనుగుణంగా రైతులు మరింత అభివృద్ధి చెందాలనే ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీపై ఆధునిక పరికరాలను అందిస్తున్నదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ వద్ద ఉన్న పొలంలో బుధవారం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి వేడుకలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులంతా ఆర్థికంగా అభివృద్ధిచెందాలన్నదే సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యమన్నారు. అందుకే వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌ను 80 శాతం రాయితీపై ప్రభుత్వం కేవలం రూ.2 లక్షలకు మాత్రమే రైతులకు అందిస్తున్నదని చెప్పారు. అలాగే డ్రోన్‌లు కొనుగోలు చేసిన రైతులకు వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా పంటలకు ఏ విధంగా పిచకారి చేయాలనే అంశంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాడి పంటలతో రాష్ట్రం సభిక్షంగా ఉండాలని కోరారు. అంతకముందు మంత్రి భూపూజ చేసి కాడెడ్లతో నాగలి పట్టుకొని పొలాన్ని దున్నారు. తరువాత రైతులకు రాయితీపై అందించే డ్రోన్‌ను ప్రారంభించారు. అలాగే రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ ఉమాప్రసాద్, తహసీల్దార్ రమేష్‌బాబు, వ్యవసాయాధికారి సౌజన్య, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అబద్ధం, నాయకులు ఎన్.వెంకటరాజు, టి.ఎరకయ్య, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, పల్లెల జగ్గారావు, ప్రగడ తులసి పాల్గొన్నారు.

కైలాసపట్నంలో ఏరువాక పౌర్ణమి



ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ఏవోలు

కోటవురట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసపట్నం గ్రామంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయం శాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్య పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త విజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రసాదరావు మాట్లాడుతూ విత్తన శుద్ధి వల్ల నారుమడిలో తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మరో శాస్త్రవేత్త శ్రీకాంత్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి సరోజిని వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నామవరంలో రూ.1.4 కోట్లతో పైపులైన్

▸ ప్రతీ ఇంటికి కుళాయి.. పేదలకు ఇళ్ల స్థలాలు

▸ గ్రామస్థులతో ముఖాముఖిలో హోం మంత్రి అనిత



నామవరం గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడుతున్న మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నుంచి నామవరం వచ్చే పైపులైన్‌ను రూ.1.4 కోట్లు మంజూరు చేస్తున్నట్టు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. మండలంలోని నామవరం గ్రామంలో బుధవారం గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొరిమివారి వీధిలో తరచూ కరెంటు సమస్య తలెత్తడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని మహిళలు తెలపగా, వెంటనే ఏఈతో మంత్రి మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇక గ్రామంలో కరెంట్ కష్టాలు ఉండవని భరోసా ఇచ్చారు. కొండగెడ్డలో పూడిక తీయించాలని గొర్ల చంటమ్మ చెప్పారు. తన భర్త మంచంపైనే ఉంటున్నాడని, పెన్షన్ ఇప్పించాలని కొర్రా లచ్చమ్మ, పక్షవాతంతో బాధపడుతున్నాని జీవనోపాధి కల్పించాలని జి.నాగేశ్వరరావు కోరగా, వారికి పెన్షన్ మంజూరు చేయాలని మండల అధికారికి మంత్రి సూచించారు. గ్రామంలో మూడు వీధులలో జలజీవన్ పనులు పూర్తికాలేదని కురందాసు శివ తెలపగా, ఈ పనులను త్వరగా పూర్తిచేసి ఇంటింటికి కుళాయిలను వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గొర్ల సత్య, షేక్ మీరాభాయి, కొర్రా లచ్చమ్మ కోరగా, త్వరలోనే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని మంత్రి అనిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.ఆనందరావు, ఎంపీపీ యిసరపు పార్వతి, సర్పంచ్ కురందాసు రామలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పరిశీలకులు వెంకటేశ్వరరావు, లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, ఈగల సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



కోటవురట్ల: జల్లూరులో చెక్కులను అందిస్తున్న టీడీపీ నేత కాశీనాయుడు

కోటవురట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లూరు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. లింగాపురం గ్రామానికి చెందిన వరహాలబాబుకు రూ.27,960, కొడవటిపూడికి చెందిన నారాయణరావుకు రూ.67,038, కోటవురట్ల గ్రామానికి చెందిన ఫాతిమాఉన్నిషాకు రూ.37,712, పి.రామన్నపాలెం గ్రామానికి చెందిన పి.రాజుకు రూ80.499 చొప్పన చెక్కులను అందజేశారు. నలుగురు బాధితులకు మొత్తం రూ.2,13,209 చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జానకి శ్రీనివాసరావు, వేచలపు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట రూరల్: మండలంలోని వెంకటనగరం గ్రామానికి చెందిన పెదకాపు శ్రీను కుటుంబీకులకు టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చించలపు ప్రదీప్, యాళ్ల వరహాలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ఇటీవల శ్రీను శస్త్ర చికిత్స చేయించుకోగా హోం మంత్రి అనిత సిఫారసు మేరకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.44 లక్షలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు వంకా సత్యనారాయణ, నాయకులు బి.కాశీవిశ్వనాథ్, కె.వెంకటేశ్వరరావు, వంకా శివ, వంకా గోపి, హరి, గోవింద్, శివయ్య పాల్గొన్నారు.

రొయ్యల పరిశ్రమ యాజమాన్యం హామీలు అమలుచేయాలి

▸ గుడివాడ పంచాయతీ ప్రజల ఆందోళన



రొయ్యల పరిశ్రమ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న గుడివాడ ప్రజలు

ఎస్.రాయవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ సమీపంలో సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమ యాజమాన్యం హామీలు అమలు చేయాలని పంచాయతీ పరిధిలోని ప్రజలు బుధవారం కంపెనీ ప్రధాన గేటు ఎదుట ఆందోళనకు దిగారు. కంపెనీ నిర్మాణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలంటూ సర్పంచ్ డి.శ్రీనుబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కంపెనీ యాజమాన్యం స్పందించి స్థానిక పెద్దలు, ప్రజలతో చర్చలు జరిపారు. ఈ మేరకు హామీలు అమలుతో పాటు సీఎస్ఆర్ నిధులు గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తామని, స్థానికులకు ఉద్యోగాలు, కంపెనీ వాడిన వ్యర్థ రసాయన జలాలను బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని ఎండీ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. దీంతో కంపెనీ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని పంచాయతీ ప్రజలు విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పి.శ్రీపతిరాజు, ఎన్.వెంకటరాజు, సీపీఎం మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ, నాయకులు ఎం.రాజేశ్, బి.రాంబాబు, డి.నానాజీ, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ ప్రారంభం

▸ తొలిరోజు 300 మందికి స్థానచలనం

▸ నేడు 301 నుంచి 800 వరకు కౌన్సెలింగ్

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీల) బదిలీ కౌన్సెలింగ్ బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. జడ్పీ సమావేశమందిరంలో ప్రారంభమైన కౌన్సెలింగ్ విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షణలో కొనసాగింది. బదిలీలకు సంబంధించి ఎస్జీటీలతో రూపొందించిన సీనియారిటీ జాబితాలో ఒకటి నుంచి 300 వరకు టీచర్లకు బదిలీ చేశారు. ప్రతి టీచర్‌ను పిలిచి వారికి కొన్ని స్కూళ్ల వివరాలు చూపిస్తున్నారు. దాంట్లో ఆప్షన్ చేసుకునే స్కూల్‌కు బదిలీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ బుధవారం రాత్రి 10.30 గంటల వరకు కొనసాగింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ మేరకు మంగళవారం ప్రారంభంకావాలి. అయితే సాంకేతిక సమస్య కారణంగా కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా వేశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించారు. గురువారం సీనియారిటీ జాబితాలో 301 నుంచి 800 వరకు అంటే 500 మందికి బదిలీలు నిర్వహిస్తారు.

విశాఖలో రోడ్డు ప్రమాదం

▸ భార్యమృతి.. భర్త పరిస్థితి విషమం

మహారాణిపేట (విశాఖపట్నం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపంలో ఇసుకకొండ సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ కుటుంబం రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ఘటనలో భార్య మృతిచెందగా, భర్త తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం పరిధిలోని బుచ్చయ్యపేట మండలం ఆర్.శివపురం ప్రాంతానికి చెందిన దేవర చిలకనాయుడు, అతని భార్య కృష్ణకుమారి కలిసి సుమారు ఏడాది వయసు ఉన్న కుమార్తెతో కలిసి ఇసుకకొండ స్వామి దర్శనానికి వచ్చారు. చిలకనాయుడు దివ్యాంగుడు కావడంతో తన మూడు చక్రాల వాహనంపై వచ్చారు. ఉదయం 10.30 గంటల సమయానికి దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఘాట్‌రోడ్డు దిగుతూ వాహనంపై వేగంగా వస్తున్నారు. వేగం తగ్గించమని అతని భార్య కృష్ణకుమారి హెచ్చరిస్తుండగానే, మలుపులో వాహనాన్ని అదుపు చేయలేక నేరుగా వెళ్లి గోడను బలంగా ఢీకొట్టాడు. దీంతో కృష్ణకుమారి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, చిలకనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలో ఉన్నవారు అతడిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. వారి చిన్నారి కుమార్తె మాత్రం క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడింది. చిలకనాయుడు పరిస్థితి విషమంగా ఉంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

‘సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి’

పాయకరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కుమారపురం శివారు రత్నయమ్మపేటలో పూర్వీకుల నుంచి సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని రైతులు కోరారు. బుధవారం గ్రామానికి చెందిన పలువుర పేదలు టీడీపీ నాయకులు కొప్పిలి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో హోం మంత్రి వంగలపూడి అనిత, తహసీల్దార్ జి.ఆనందరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కుమారపురం రెవెన్యూలోని సర్వే నం.218/1లో సుమారు 16 ఎకరాల భూమిని 55 ఏళ్లుగా సాగుచేసుకుం జీవిస్తున్నామని, ఈ భూమికి ఎటువంటి రెవెన్యూ రికార్డులు లేనప్పటికీ 1970లో అప్పటి ప్రభుత్వం తమకు స్వాధీన పత్రాలు మంజూరు చేసిందని చెప్పారు.

మహిళలను కించపరచడమే వైసీపీ నైజం

▸ రాష్ట్రంలో అశాంతిని సృష్టించే దిశగా కుట్రలు

▸ పలువురు నేతలు ఆగ్రహం



అచ్యుతాపురంలో సీఐ గణేశ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మహిళలు

మునగపాక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అశాంతిని సృష్టించే దిశగా వైసీపీ కుట్రలు పన్నుతోందని గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం మండలంలోని తిమ్మరాజుపేటలో తెలుగు మహిళలు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఇటీవల కాలంలో ఏదో ఒక రూపంలో మహిళలను కించపరచడమే ధ్యేయంగా వైసీపీకి చెందిన పలువురు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇది వారి నైజంగా పేర్కొన్నారు. జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు మాట్లాడుతూ మహిళల పట్ల తప్పుడు వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సజ్జలపై కూడా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు కర్రి అనూరాధ, నారాయణమ్మ, పెంటకోట స్వాతి, శరగడం ఈశ్వరమ్మ, గ్రామశాఖ అధ్యక్షుడు బి.వి.రమణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అమరావతి మహిళలను కించపరిచిన వారిపై ఫిర్యాదు

అచ్యుతాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు లాలం శాంతి అన్నారు. పలువురు మహిళలతో కలిసి బుధవారం ఇక్కడ సీఐ నమ్మి గణేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే ఇలా నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళలను కించపరచేవిధంగా మాట్లాడిన వారితో పాటు సాక్షి మీడియాపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లాలం చిన శాంతి, సీతమ్మ, ఏకా లక్ష్మి, రెడ్డి రాము, ఏక పార్వతి, బొట్ట నూకమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలి’

మునగపాక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు తడిసిన ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో బుధవారం పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టపోయిన వారిని గుర్తించిన సహాయ, సహకారాలు అందించాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీలపై గ్రామసభ

పాయకరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో పాయకరావుపేట పంచాయతీలో చేసిన పనులపై జరిగిన సామాజిక తనిఖీపై బుధ వారం గ్రామసభ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వ హించిన గ్రామసభలో సామాజిక తనిఖీల డీఆర్పీ నాయుడు మాట్లాడుతూ 2024-25లో పాయకరావుపేట పంచాయతీలో ఎన్ఆర్ ఈజీఎస్ పథకం ద్వారా జరిగిన పనులపై తనిఖీలు చేశామని చెప్పారు. ఈ పనులకు మంజూరైన నిధులు, చేసిన ఖర్చు, చెల్లింపులు తదితర వివరాలు సేకరించామన్నారు. ఈ నెల 20వ తేదీన జరిగే ప్రజావేదికలో ఈ వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి శివరామ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

▸ పంచదార్లలో ఘనంగా ఏరువాక పౌర్ణమి ▸ నాగలి చేతబట్టి దుక్కిదున్నిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



పంచదార్లలో దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పంచదార్ల గ్రామంలో బుధవారం భూమిపూజ చేసి, సాంప్రదాయబద్ధంగా నాగలి చేతబట్టి దుక్కి దున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తుండడం వల్ల అన్నదాతలు వ్యవసాయ పనులు ప్రారంభించారని, వారికి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం ముందుగానే సరఫరా చేసిందని వివరించారు. ఈ ఏడాది పంటలు బాగా పండి, మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. అనంతరం రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో జయమాధవి, ఇన్‌చార్జి ఏడీఏ సి.సుమంత, పశు వైద్యాధికారి కె.రఘునాథ్, టీడీపీ మండల నాయకుడు వి.దిన్‌బాబుతో పాటు పలువురు అధికారులు, నాలుగు మండలాల ఏఈవోలు, ఎంపీఈలు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, జనవాణి ద్వారా ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. హరిపురం జనసేన కార్యాలయంలో అచ్యుతాపురం మండల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జనసేన అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు, మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో సచివాలయ భవనాలు ప్రారంభం

ఎలమంచిలి : పట్టణంలోని పీవీ కాంప్లెక్సు ఆవరణలో గల రెండో అంతస్తుపై సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన రెండు నూతన సచివాలయ భవనాలను ఎమ్మెల్యే విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది ప్రజలకు చక్కని సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావాలని సూచించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఎమ్మెల్యేకు మొక్కను జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కూటమి నాయకులు లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్, బొద్దపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొండకర్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ కష్టాలు

▸ కిలోమీటరు మేర నిలిచిపోయిన వాహనాలు

▸ పోలీసులు రంగప్రవేశంతో సజావుగా రాకపోకలు



కొండకర్ల జంక్షన్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

అచ్యుతాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం- అనకాపల్లి ప్రధాన రోడ్డులో గల చోడపల్లి- కొండకర్ల జంక్షన్ల మధ్య బుధవారం సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా సెజ్ కర్మాగారాల్లో మొదటి షిఫ్ట్ ముగించుకొని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణకు వినియోగించే భారీ యంత్రాల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రస్తుతం ఇది సింగిల్ రోడ్డు, దీనికి తోడు రోడ్డుకిరువైపులా విస్తరణ పనులు జరుగుతున్నాయి. వర్షం కురవడంతో తారు రోడ్డుకు ఇరువైపులా బురదమయమైంది. దీంతో వాహనాలు కిలోమీటరు మేర నిలిచిపోయాయి. కొద్ది సేపటి తరువాత పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో రాకపోకలు సజావుగా సాగాయి.

కూటమి ఏడాది పాలనపై నేడు సంబరాలు : ప్రగడ

ఎలమంచిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి సంబరాలు జరపనున్నట్టు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అప్పుల కుప్పగా మార్చిన రాష్ట్రాన్ని ఏడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్ తదితరులు అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న వేడుకలకు పార్టీ శ్రేణులంతా తరలి రావాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

తహశీల్దార్ల బదిలీలు

... 3వ పేజీ తరువాయి

జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఆరుగురు డిప్యూటీ తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరితోపాటు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న, ఐదేళ్ల సర్వీసు పూర్తయిన 72 మంది డీటీలకు, వివిధ తహశీల్దారు కార్యాలయాల్లో పనిచేస్తున్న 38 మంది సీనియర్ అసిస్టెంట్లు, 13 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు టైపిస్టులను వివిధ మండలాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కూటమి పాలనపై సానుకూలత

... 3వ పేజీ తరువాయి

తెచ్చుకునే వెసులుబాటు కల్పించడం ఎంతో బాగుందన్నారు. తుమ్మపాలకు చెందిన ఆటో డ్రైవర్ నంబూరు నాయుడు మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది మాత్రమే అయ్యిందని, మిగిలిన నాలుగేళ్లలో అన్ని హామీలను అమలు చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

అనకాపల్లి శారదానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యగుప్తా మాట్లాడుతూ... కూటమి ఏడాది పాలన బాగుందన్నారు. గతం ప్రభుత్వంలో ప్రజా సమస్యలపై పెద్దగా స్పందన ఉండేది కాదని, ముఖ్యంగా గ్రామాల్లో రహదారుల గురించి పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏడాది కాలంలోనే గ్రామీణ రోడ్లన్నీ బాగుపడ్డాయన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసే సమర్థత కూటమి ప్రభుత్వానికి ఉందని భావిస్తున్నానన్నారు. నర్సింగరావుపేటకు చెందిన చవితిని నూకరాజు మాట్లాడుతూ, అనకాపల్లి నూకాంబిక జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడం గొప్ప విషయమన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.4 వేలకు పెంచడంతో లక్షలాది మంది సంతోషంగా వున్నారని, అయితే సొంతింటి కల నెరవేర్చాలని పేదలు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. కొప్పాక గ్రామానికి చెందిన శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత వైసీపీ పాలనతో పోల్చుకుంటే కూటమి పాలన బాగుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు వున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకొనేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కృషి జరుగుతున్నదని, దీనివల్ల భవిష్యత్తులో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. శారదా కాలనీకి చెందిన రిక్షా కార్మికుడు అచ్చిబాబు మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించడం చాలా సంతోషంగా వుందన్నారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లాల్సిన పనిలేకుండా రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌కు వెళ్లి రూ.5తో కడుపు నిండా భోజనం చేస్తున్నట్టు చెప్పారు. తగరంపూడికి చెందిన రైతు పి.శ్రీను మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాలకు మేలు చేసిందన్నారు. రైతులకు సకాలంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు అందించారని, అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే పెట్టుబడి నిధులు అందిస్తుందని అన్నారు.

సీఎం రాక రేపు

... 3వ పేజీ తరువాయి

నుంచి 11.20 గంటలకు నోవాటెల్ హోటల్‌కు చేరుకుని, మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రెన్యుబుల్ ఎనర్జీపై జరిగే ప్రాంతీయ వర్క్‌షాపులో పాల్గొంటారు. ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ హోటల్‌లో ఉండి, రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలపై సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు హోటల్ నుంచి బయలుదేరి 4.10 గంటలకు సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన ‘ది డెక్’ భవనం వద్దకు చేరుకుని దానిని ప్రారంభిస్తారు. అందులోనే ఏర్పాటవుతున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను కూడా ప్రారంభించి విద్యార్థులు, ఔత్సాహికులు, స్టార్టప్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం 4.50 గంటలకు బయలుదేరి సమీపంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాకు వెళతారు. ఆరు గంటల వరకూ పలు పరిశ్రమలకు సంబంధించిన శిలాఫలకాలు ఆవిష్కరి స్తారు. అక్కడే పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించి, తరువాత వర్చువల్‌గా ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అక్కడ నుంచి ఆరు గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని 6.30 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు. ఆయా ప్రాంగణాలు, వేదికలను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత కలిసి బుధవారం పరిశీలించారు. కొన్ని అత్యవసర పనులు వెంటనే పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

జనరంజక పాలన



కూటమి ప్రభుత్వ పనితీరుపై వివిధ వర్గాల మనోగతం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై వివిధ వర్గాలు సానుకూలంగా స్పందించాయి. పరిపాలన గాడిలో పడిందని, వివిధ వర్గాలకు మేలు చేకూరుతోందని సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి మరింత చేయూత, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి నిలపడం, మిగిలిపోయిన పేద వర్గాలకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేయడం అవసరమని సూచించారు. పాలనపై ఎవరు ఏమన్నారంటే....



రోడ్లు బాగుపడ్డాయి... ఇక్కట్లు తొలగాయి

గత ప్రభుత్వంలో రోడ్లు ఎంత దారుణంగా వున్నాయో అందరికీ తెలిసిందే. రిక్షా తొక్కడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. విడిభాగాలు తరచూ పాడూపోయేవి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను బాగు చేస్తామని చెప్పడమే కాకుండా ఆచరణలో అమలు చేశారు. ఇప్పుడు సాఫీగా రిక్షాలు తొక్కగలుగుతున్నాం. సీఎం చంద్రబాబు ప్రజలకు నిరంతరం సేవలందించాలనే ఉద్దేశంతో చక్కటి పరిపాలన సాగిస్తున్నారు.

- **నొట్ల అప్పారావు**, రిక్షా కార్మికుడు, అనకాపల్లి



వ్యాపారులకు ఇబ్బందులు లేవు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు కలగలేదని భావిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఎప్పుడు, ఎటువంటి ఆంక్షలు విధిస్తారోనని ఆందోళనగా ఉండేది. ఇప్పుడు ప్రశాంతంగా వ్యాపారం చేసుకుంటున్నాం. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతున్నాయి. గతంలో కిలో రూ.160 ఉన్న కందిపప్పు ప్రస్తుతం రూ.100కి దిగివచ్చింది. మొత్తం మీద కూటమి ఏడాది పాలన చాలా బాగుంది.

- **శ్రీధరాల సోమరాజు**, హోల్‌సేల్ కిరాణా వ్యాపారి, అనకాపల్లి



పరిశ్రమల రాకతో ఉపాధి, ఉద్యోగాలు

గత వైసీపీ ప్రభుత్వంతో పోల్చితే కూటమి ప్రభుత్వ పరిపాలన బాగుంది. నిత్యావసర సరుకుల ధరలు కొంతమేర తగ్గాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కోసం తరచూ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం. దీనివల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

- **ఎన్.శివ**, ప్రైవేటు ఉద్యోగి, గొల్లపేట, అనకాపల్లి మండలం



సకాలంతో జీతాలు అందుతున్నాయి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటి, రెండు తేదీల్లో జీతాలు జమవుతున్నాయి. ఏటా ఉపాధ్యాయుల బదిలీలకు చట్టం చేయడం హర్షణీయం. ఈ ఏడాది ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని ఆహ్వానిస్తున్నాం. బకాయి డీఏల్లో కనీసం రెండు లేదా మూడు విడుదల చేసినట్టయితే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు సంతృప్తి చెందుతాయి.

- **కొరుపోలు గంగాధర్**, ఉపాధ్యాయుడు, పరవాడ



కూటమి పాలన బాగుంది

డ్వాక్రా మహిళలకు రుణం మంజూరైన తరువాత ఒక్కో సభ్యురాలికి ఎంత వస్తుందో ముందుగానే చెప్పి, బయోమెట్రిక్ తీసుకున్న తరువాత ఖాతాలో రుణం డబ్బులు వేస్తున్నారు. ఈ విధానం చాలా బాగుంది. గతంలో గోతులు పడిన రోడ్లను బాగు చేస్తున్నారు. ఇంట్లో చదివే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ అమ్మకు వందనం పథకం అమలు చేస్తామని చెప్పడమేకాకుండా.. రేపు (గురువారం) డబ్బులు వేస్తామని చెప్పడం ఆనందంగా వుంది. కూటమి పరిపాలన బాగుంది.

- **బొడ్డేటి ఆదియ్యమ్మ**, గృహిణి, మాడుగుల



కష్టకాలంలో హామీలు నెరవేర్చడం గొప్ప విషయం

రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిన సమయంలో పాలన పగ్గాలు చేపట్టిన సీఎం చంద్రబాబునాయుడు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం గొప్ప విషయం. ఎన్నాళ్ల నుంచో నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడి, పోటీ పరీక్షలు కూడా జరుగుతున్నాయి. రాజధాని అమరావతి నిర్మాణ పనులు మొదలు కావడం సంతోషం. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రభుత్వం ద్వారా ఏదో ఒక సాయం అందుతున్నది. రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్న నమ్మకం ప్రజలకు ఏర్పడింది.

- **వై.గుణశేఖర్**, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, గొడిచెర్ల, నక్కపల్లి మండలం



'ఆదరణ' పథకాన్ని పునరుద్ధరించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ పాలన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం. ఉపాధ్యాయ నిరుద్యోగుల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్వ విధానంలో రేషన్ పంపిణీ చాలా మంచి నిర్ణయం. బీసీ కుల వృత్తుల వారికి 'ఆదరణ' పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతున్నాను.

- **కొత్తలి చిన్నారావు**, లాండ్రీ దుకాణం, ఏఎస్‌ఆర్ కాలనీ, ఎలమంచిలి



పావలా వడ్డీ రుణాలు కొనసాగించాలి

కూటమి ప్రభుత్వం పాలన బాగానే ఉంది. వలంటీర్లు లేకపోయినప్పటికీ ప్రతి నెలా ఒకటో తేదీన ఇళ్లకు వచ్చిన పింఛన్ డబ్బులు ఇవ్వడం సంతోషం. తల్లికి వందనం పథకాన్ని పిల్లలందరికీ అమలు చేయడం బాగుంది. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు కొనసాగించాలి. 50 ఏళ్లలోపు ఒంటరి మహిళలకు కూడా పింఛన్ మంజూరు చేయాలి.

- **చలపాక వెంకటలక్ష్మి**, బీసీ కాలనీ, నర్సీపట్నం



వైసీపీ హయాంలో నిత్యం భయం..భయం

గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉండేది. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి లేదు. హ్యాపీగా వ్యాపారం చేసుకుంటున్నాను. చేతినిండా పనులు ఉంటున్నందున వ్యాపారం కూడా బాగానే ఉంది. నిత్యావసర సరుకుల ధరలు కొద్దిగా తగ్గేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే పేదలకు మంచి చేసినట్లవుతుంది.

- **పోలిశెట్టి వెంకటేశ్**, కిరాణా వ్యాపారి, పాయకరావుపేట

సోమవరంలో 'సూర్యఘర్' వెలుగులు

- సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యుత్ సరఫరా
- ఎమ్మెల్యే కొణతాల వెల్లడి
- రైతులతో కలిసి ఏరువాక పౌర్ణమి



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యఘర్ పథకం కింద మండలంలోని సోమవరం గ్రామంలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసి ఉచితంగా గ్రామస్థులకు కాంతులు ఇవ్వనున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెనిద్ర కార్యక్రమం బుధవారం రెండో రోజుకు చేరుకుంది. తొలుత ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆయన రైతులతో కలిసి నాగలి పట్టి దుక్కు దున్నడమే కాకుండా ట్రాక్టర్‌తోనూ పొలాన్ని దున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయం బాగాపండి రైతుల ఇంట సిరులు కురవాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో అంతర్గత కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. పంచాయతీలో ప్రభుత్వ భూమిని గుర్తించి ఒకేచోట సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఈ గ్రామంలో మొట్టమొదటిసారిగా ఈ పథకాన్ని అమలు చేసి నియోజకవర్గం మొత్తం చేపడతామన్నారు. అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అంతా దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగు తదితరాల వల్ల అనర్థాలను వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలు పోషకాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్లి అక్కడున్న చిన్నారులతో ముచ్చటించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతి నిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్, సీఐ అల్లు స్వామినాయుడు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి, సీడీపీవో ప్రభావతి తదితరులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మూడు రెట్లు అదనంగా పరిహారం చెల్లించండి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణికి తెలిపిన నిర్వాసిత రైతులు
- తాళ్లపాలెం, ఉగ్గినపాలెం పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలు

కశింకోట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న తమకు ప్రస్తుత మార్కెట్ విలువ కంటే మూడు రెట్లు అదనంగా నష్టపరిహారం అందించాలని పలువురు రైతులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణిని కోరారు. మండలంలోని తాళ్లపాలెం, ఉగ్గినపాలెం పంచాయతీ కార్యాలయాల్లో భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం ఆమె సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు త్రిరి ఈశ్వరరావు, కలగ గున్నయ్యనాయుడు, కలగ ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నష్టపరిహారం ఆరు నెలల్లో చెల్లించాలన్నారు. దీనిపై ఎస్‌డీసీ రమామణి మాట్లాడుతూ 2021 సంవత్సరంలో సుమారు 40.65 ఎకరాల భూమిని ప్రాథమిక నోటిఫికేషన్ ద్వారా సేకరించామన్నారు. అప్పటి నుంచి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో రైతులకు నష్టపరిహారం చెల్లించలేక పోయామని వివరించారు. తాజాగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేసిన నేపథ్యంలో కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసేందుకు క్షేత్రస్థాయిలో భూ పరిశీలన జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణ, పోలవరం ఇరిగేషన్ ఈఈ ఎ.ఉమేష్‌కుమార్, రైతులు అమిరలపల్లి నాగమణి, అప్పారావు, సరోజిని, బత్తిన నాగఅప్పారావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భూ నిర్వాసిత రైతుల సమావేశంలో ఎస్డీసీ రమామణి, తదితరులు

నేడు పరవాడలో దుర్గమాంబ పండుగ



పరవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో దుర్గమాంబ పండుగను గురువారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజాన అమ్మవారికి విశేష అంకరణలు, పూజల అనంతరం దర్శనాలు ప్రారంభం కానున్నారు.

ఎన్‌ఎంయూఏ సమ్మె నోటీసు

- డీఆర్‌ఓకు అందజేసిన యూనియన్ నేతలు



డీఆర్‌ఓకు సమ్మె నోటీసు అందజేసిన ఎన్‌ఎంయూఏ కార్మికులు

అనకాపల్లి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ (ప్రజా రవాణా శాఖ) ఎన్‌ఎంయూఏ కార్మికులు సమ్మె హారన్ మోగించారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌ఓ సత్యనారాయణరావుకు నోటీసు అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు అనకాపల్లిలో నాలుగు నెలలుగా ఆందోళనలు, వంద రోజులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించినట్టు గుర్తు చేశారు. 1/2019 సర్క్యులర్‌ను విజయనగరం జోన్‌లో అమలు చేయకపోవడంతో తాము సమావేశం నిర్వహించుకొని సమ్మె చేయాలని తీర్మానించినట్టు యూనియన్ నాయకులు పి.సుధాకర్ తెలిపారు. అక్రమ డ్యూటీలను సరిచేయాలని, డ్యూటీకి డ్యూటీకి మధ్య చట్ట ప్రకారం తొమ్మిది గంటల విశ్రాంతి అమలు చేయాలని, అన్ని డ్యూటీలకు సరిపడ రన్నింగ్ సమయం కల్పించాలని, నర్సీపట్నం, అనకాపల్లి డిపోల్లో ఉన్న హార్డ్ షెడ్యూల్‌ను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేసినప్పటికీ యాజమాన్యం స్పందించక పోవడంతో ఈనెల 25 తర్వాత సమ్మెకు దిగుతున్నట్టు పేర్కొన్నారు.

సబ్బవరంలో భారీ వర్షం

- పోలీసు స్టేషన్ జలమయం
- లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో జనం అవస్థలు



ముంపునకు గురైన సబ్బవరం పోలీస్ స్టేషన్

సబ్బవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది.లోతట్టు ప్రాంతాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. సబ్బవరం పోలీస్ స్టేషన్ జలమయమైంది. ప్రాంగణంలోకి నీరు భారీగా వచ్చి చేరడంతో ఇటు సిబ్బందితో పాటు, అటు ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇరువాడ కొండ నుంచి సాయినగర్ మీదుగా ఉధృతంగా రహదారిపై నీరు ప్రవహించడంతో పోలీసు స్టేషన్ ముంపునకు గురైందని అంటున్నారు. అలాగే, ఇక్కడి కూడలి సమీపంలోని దండు కోనేరులో పూడిక తొలగించకపోవడంతో వర్షపు నీరు బయటికి పోయే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

దత్తసాయి మందిరంలో పౌర్ణమి పూజలు



కొత్తూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో శారదా నది ఒడ్డున ఉన్న దత్తసాయి మందిరంలో పౌర్ణమి పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి విశేష పూజలు అభిషేకాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఘనంగా ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి

తుమ్మపాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీనగరం ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో బుధవారం సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీగాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సినీ పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు బల్లా నాగభూషణం, నీలేష్‌గుప్తా, కృష్ణమోహన్, మల్లేశ్వరరావు, రామారావు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాలయాన్ని సందర్శించిన రీజనల్ డైరెక్టర్



వైద్యాలయంలో ఆర్‌డీ, ఇన్ చార్జి డీసీహెచ్‌ఎస్ తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయాన్ని బుధవారం రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రమణమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా జనన, మరణ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీల్లో తుమ్మపాల వాసికి స్వర్ణపతకం



బంగారు పతకం అందుకున్న నరసింగరావు

తుమ్మపాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా యోగా కల్చరల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన 35వ నేషనల్ ట్రెడిషనల్ యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో తుమ్మపాలకు చెందిన బుదిరెడ్డి నరసింగరావు 55 ఏళ్ల నుంచి 65 ఏళ్ల కేటగిరిలో బంగారు పతకాన్ని సాధించారు. ఈ పోటీలకు 12 రాష్ట్రాల నుంచి 680 మంది హాజరుకాగా, నరసింగరావు స్వర్ణపతకం సాధించడం విశేషం. ఈ సందర్భంగా అతనికి టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు, నడిపల్లి గణేష్, పడాల గణపతిరావు, కర్రి జోగినాయుడు, వేణు గోపాల స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

జనసేన పరవాడ మండల కమిటీ ఏర్పాటు

పరవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జనసేన మండల నూతన కమిటీ బుధవారం ఏర్పాటైనట్టు ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యక్షులుగా వెన్నెల నరసింహారావు, వర్రి పరదేశినాయుడు, ప్రధాన కార్యదర్శిగా కరణం నరసింగరావు, అధికార ప్రతినిధిగా బండారు రాజు, కార్యదర్శులుగా రమణ, దినేష్, రాము, రాజు, అశోక్, సంయుక్త కార్యదర్శులుగా హరి, శివ, శ్రీను, మసేను ఎన్నికయ్యారన్నారు.

'విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

అనకాపల్లి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థకు, ఉద్యోగుల భవిష్యత్తుకు నష్టదాయకమైన ప్రైవేటీకరణ విధానాలను విడనాడడంతో పాటు కార్మిక సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వేపాటి సత్యనారాయణ కోరారు. గుంటూరులో జరగనున్న యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్ బుధవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు ప్రేమచంద్రశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమి వేడుకల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి తదితరులు



హుకుంపేట: అభ్యుదయ రైతును సన్మానిస్తున్న ఏవో

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి
- ఉత్సాహంగా ఏరువాక పౌర్ణమి

పాడేరురూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని బుధ వారం మండల పరిధి వనుగుపల్లి పంచాయతీ తామరాపల్లిలో వ్యవసా య శాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఖరీఫ్ పనులను ఆమె ప్రారంభించారు.కొంతసేపు నాగలిపట్టి పొలంలో దుక్కిదున్నారు. అనం తరం ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ అన్నదాతకు కలిసి వచ్చి మంచి ఆదాయం తెచ్చి పెట్టాలని ఆకాంక్షించారు. ఏరువాక సందర్భంగా ఖరీఫ్ పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెలలోనే కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్‌తో కలిపి రా ష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీ భవ ఇవ్వనుందన్నారు. వ్యవసాయ పనిముట్లు, పవర్ వీలర్స్ తదితర పరి కరాలను రాయితీ అందిస్తున్నట్టు చెప్పారు. రైతు ముఖంలో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, నియోజకవర్గ తెలుగు యువత అ ధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, జిల్లా వ్యవసాయాధి కారి ఎస్‌బీఎస్.నంద, జిల్లా ఉద్యానధికారి, సెరీకల్చర్ అధికారిపాల్గొన్నారు.

వర్షాలు ఖరీఫ్‌కు అనుకూలం: ఏవో

పెదబయలు: తన కష్టంతో దేశానికి అన్నం పె డుతున్న అన్నదాతలు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి శ్రీని వాస్ ఆకాంక్షించారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ఉదయం మండల కేంద్రంలో రైతులతో ఆయన మమేకమయ్యారు. దుక్కి దున్నే సమయంలో పొలాలకు వద్దకు వెళ్లి రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ముందుగా పడటంతో ఖరీఫ్ సేద్యానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు అందిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏవో నాగలి పట్టి దుక్కి దున్నారు. వ్యవసాయ సాగులో మెలకువలను సూచించారు. అనంతరం అభ్యుదయ రైతు డడియ నాగేశ్వరరావును శాలువతో సన్మానించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో విద్యుత్ మరమ్మ తులు చేపడుతున్న నేపథ్యంలో 13వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉం టుందని ఈపీడీసీఎల్ పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్‌సీహెచ్ పాత్రుడు బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. జి.మాడుగుల సబ్‌స్టేషన్‌లో సొలభం ఫీడర్ మరమ్మతు నేపథ్యంలో సొలభం, వంతాల, పెద లోచలి, గడుతూరు గ్రామాలకు, కొయ్యూరు సెక్షన్‌లోని చీడిగుమ్మల ఫీడర్‌లో చీడిగుమ్మల, రామన్నపాలెం, గోపవరం, లింగాపురం, నిమ్మలగెడ్డ గ్రామాలకు, హుకుంపేట సబ్‌స్టేషన్‌లో సంతారి ఫీడర్ పరిధిలోని సంతారి, ఉప్ప, రాప, పెదగరువు, మత్స్యపురం గ్రామా లకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే, చింతపల్లి సబ్ స్టేషన్‌లో పెదవలస ఫీడర్ మర మ్మతులు చేపడుతున్నందున పెదవలస, సంకాడ, నిమ్మలపాలెం గ్రామాలకు, అనంతగిరి సెక్షన్‌లో 33 కేవీ భీమవరం ఫీడర్ పరిధి భీమవరం, భీంపోలు, గరు గుబిల్లిలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.విని యోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొయ్యూరు ఈవోపీఆర్‌డీగా సీతయ్యనాయుడు

కొయ్యూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ విస్తరణాధికారి (ఈవోపీఆర్‌డీ)గా లాలం సీతయ్యనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేసిన ఈవోపీఆర్‌డీ ఎస్‌కేవీ ప్రసాద్ దేవరాపల్లి బదిలీపై వెళ్ళగా అనంతగిరిలో పనిచేస్తున్న సీతయ్యనాయుడును కొయ్యూరుకు కేటాయించారు.

ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యం తరలింపు: డీటీ



జీసీసీ గొడౌన్‌లో బియ్యం రికార్డులను పరిశీలిస్తున్న డీటీ చంద్రశేఖరరావు

చింతపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు గిరిజన సహకార సంస్థ గొడౌన్ల నుంచి సన్న బియ్యం సర ఫరా చేసినట్టు స్థానిక ఉప తహసీల్దార్ చంద్రశేఖరావు అన్నారు. బుధవారం జీసీసీ గోదామును ఎంఈవో-2 బోడం నా యుడుతో కలిసి సందర్శించారు. వివిధ పాఠశాలలకు కేటాయించిన సన్న బి య్యం తరలింపును పరిశీలించారు. ఈసందర్భంగా డీటీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తోంద న్నారు. గురువారం నుంచి విద్యార్థులకు ఈ బియ్యంతో ఆహారం సిద్ధం చేయాలన్నారు.

పెదబయలులో వర్షం



బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

పెదబయలు, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): మండ లంలో బుధవారం కుండ పోత వర్షం కురిసింది. ఉద యం నుంచి ఆకాశం మేఘ వృతమై ఉంది. మధ్యాహ్నం కొన్ని ని మిషాలపాటు తేలి కపాటి చిరుజల్లులు పడ్డాయి. అనం తరం రాత్రి 7 గంటల సమ యంలో కుండపోత వర్షం కురి సింది. జనజీవనం స్తంభించింది.రహదారులపైనీరు ప్రవహించింది. మండల కేంద్రంలో డ్రైనేజీల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాత మెడికల్ షాపు వెనకాల వీధిలో గృహాల వద్ద నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

జి.మాడుగుల సీడీపీవోగా బాలదేవి బాధ్యతల స్వీకరణ



జి.మాడుగుల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీ డీఎస్ సీడీపీవోగా బాలదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సువరమ్మ బది లీ కావడంతో హుకుంపేట మండ లంలో సీడీపీవోగా విధులు నిర్వ హిస్తున్న బాలదేవి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తా నన్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేస్తానన్నారు. అంగన్ వాడీల్లో సేవలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందేలా చూస్తానని ఆమె తెలిపారు.

చెరువు గట్లపై మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు రమేశ్

గూడెంకొత్తవీధి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన చెరువు గట్లలో ఉద్యాన మొక్కల నాటాలని టీడీపీ మండలా ధ్యక్షుడు ముక్కలి రమేశ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ సిబ్బంది ఉద్యా న పంటల మొక్కలను పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఉద్యాన పంటల సాగుకి అధిక ప్రా ధాన్యం ఇస్తోందన్నారు. రైతులకు పలు రకాల ఉద్యాన మొక్కలను ఉచితంగా అందజేస్తోందన్నారు. తాజాగా చెరువు గట్లలోనూ కొబ్బరి, జామ, సపోటా, సీతాఫ లం, నిమ్మ మొక్కల నాట్లు ఉపాధి సిబ్బంది వేస్తున్నా రన్నారు. గిరిజనులు ఈ మొక్కలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధి పథకం ఈసీ శ్రీనివాసరావు, సర్పంచ్ సుభద్ర పాల్గొన్నారు.

తాబేలు గుమ్మి చెక్‌డ్యామ్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నీటి సంఘం సభ్యులు

జి.మాడుగుల, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి) : మండ లంలోని కె.కోడాపల్లి పం చాయతీ బందవీధి తాబేలు గుమ్మి చెక్‌డ్యామ్ పనులను సాగునీటి సంఘం సభ్యులు పెంటయ్య, నూకరాజు ఆధ్వర్యంలో బుధ వారం ప్రారంభించారు. రూ. 10లక్షల అంచనా వ్య యంతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలకమ్మ, పిన్నయ్యదొర పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కళ్యాణగుమ్మి గిరిజనులు

అనంతగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గుమ్మ పంచాయతీ కళ్యాణగుమ్మి గ్రామానికి రో డ్డు నిర్మాణానికి అవసరమైన అటవీశాఖ అనుమ తులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం గి రిజనులు ఆందోళన చేపట్టారు. 2024లో రూ.కోటి మంజూరు చేశారు. అయితే అటవీశాఖ అనుమతులు లేక ఇప్పటికీ రోడ్డు పనులు ప్రారంభించలేదు. దీంతో గ్రామంలోని 12 మంది విద్యార్థులు దేవరాపల్లి మం డలం బోడుగరువు గ్రామానికి గెడ్డలు దాటుకుంటూ వెళ్లి చదువులు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాని వారు ఈ సం దర్భంగా కోరుతున్నారు.

మలేరియా నివారణకు చర్యలు

- సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు



కిలగాడ పాఠశాలలో దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న సబ్ యూనిట్ అధికారి

ముంచంగిపుట్టు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మలేరియా నివార ణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు మలేరియా సబ్ యూ నిట్ అధికారి నా గేశ్వరరావు అ న్నారు. మండలంలోని కిలగాడ, లబ్బూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మలే రియా వ్యాధి సోకకుండా గ్రామాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా స్ప్రే చేయిస్తున్నట్టు చెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. ఆశ్రమ పాఠశాలల్లో దోమల నివారణ మందు చల్లిస్తున్నట్టు చెప్పారు. పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని, ఆరోగ్య సూత్రాలను పాటిం చాలని, వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని సూచించారు. దోమ తెరలు తప్పకుండా వినియోగించాలని ఈసందర్భంగా సూచించారు. ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన స్వర్ణయుగం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు

పాడేరురూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన స్వర్ణయుగమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు కొనియాడారు. స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో బుధవారం మైనార్టీ మోర్చా రాష్ట్ర సహ ప్రభారీ పెనుమాక రవికుమార్ అధ్యతన జరిగిన బీజేపీ 11 ఏళ్ల సేవా సుపరిపా లన- పేదల సంక్షేమ వికసిత భారత్-2027 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజ రైన ఆయన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, జిల్లా అధ్యక్షు రాలు మఠం శాంతకుమారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రధాని పాలన 11 ఏళ్లు పూర్తయిన సం దర్భంగా దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారానికి కార్యకర్త, నాయ కులు ముందుండాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వీడీవీకేలు మహిళలకు ఎంత గానో ఉపయోగపడుతున్నాయన్నారు. కేంద్ర నిధులతో గిరిజనాభివృద్ధికి రాష్ట్రంలో చేపట్టిన వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావ తిని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడమే ప్రధాని మోదీ లక్ష్యం అన్నారు. టూరిజం అభివృద్ధి చేసి గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాలు కల్పి స్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య, బీజేపీ ముఖ్యనాయకులు సల్లా రామకృష్ణ, పాంగి రాజారావు, కూడా కృష్ణారావు, కె.శ్రీని వాసరావు, పాపిడిరాజు, ఎల్. అబ్బాయిదొర, కె. వెంకటరమణ, ఎం.గోపాలపా త్రుడు, బాలకృష్ణ, సోమేశ్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట సీడీపీఓగా సువర్ణమ్మ



హుకుంపేట జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థాని క ఐసీడీఎస్ సీడీపీవోగా సువర్ణమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీడీపీవోకు జి. మాడు గలు బదిలీ అ యింది. ఈ సందర్భంగా సువర్ణమ్మ మాట్లాడు తూ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగు పరిచేలా కృషి చేస్తానన్నారు. గర్భిణులు, బా లింతలకు పౌష్టికాహారం పక్కాగా అందేలా కృషి చేస్తానని తెలిపారు, ఈ సందర్భంగా ఆమెను సిబ్బంది శుభా కాంక్షలు తెలిపారు.

క్షయ వ్యాధిపై ఆందోళన వద్దు: వైద్యాధికారి

హుకుంపేట జూన్ 11 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై ఆందోళన చెంద వద్దని వైద్యాధికారి మోహన్ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని గడ్డకించుమండ పంచాయితి సన్యాసంపాలెంలో టీబీ ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా గ్రామస్థులకు బీపీ, షుగర్, టీబీ వైద్య పరీక్షలు నిర్వహించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం ఉంటే పీహెచ్‌సీలకు వచ్చి కఫం పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే, మందులు సక్రమంగా వాడుతూ, పౌష్టిహారం తీసుకుంటే వ్యాధి తగు ముఖం పడుతుందని తెలిపారు. ధూమపానం, మద్యపానంనకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది, టీబీ సూపర్ వైజర్ సదానందం, ఎస్‌టీఎస్ నాగేశ్వరావు, కో ఆర్డి నెటర్ ధనరాజ్, ఏఎన్ఎం నిర్మల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడేరు ఆర్టీసీ డిపోలో సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ కార్యాలయంలో ఎన్ఎంయూ నాయకులు వినతి



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పాడేరురూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల సమ స్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎన్ఎంయూ పాడేరు డిపో సెక్రటరీ ఎస్ఆర్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యా లయంలో వినతిపత్రం అందించారు. అనంతరం యూనియన్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 8వ తేదీన విజయన గరం జోన్ విస్తత స్థాయి సమావేశంలో చర్చించామన్నారు. పాడేరు డిపో ఉద్యోగుల సమస్యలపై డిపో అధికారులకు, డీపీటీవోకు పలుమార్లు వినతులు ఇచ్చి నా స్పందించకపోవడంతో ఈ నెల 25వ తేదీ తరువాత సమ్మెకు సిద్ధం కావాలని జోన్ స్థాయి సమావేశంలో తీర్మానం చేసినట్టు చెప్పారు. ఇప్పటికైనా పాడేరు డిపో లో సమస్యలు పరిష్కరించి సమ్మె జరగకుండా చూడాలని కలెక్టర్‌ను కోరామన్నారు. డిపో నాయకులు ఐఎం.కొండ, ఐఆర్.రావు, డీఎస్ నారాయణ, ఎస్ఎస్.బాబు, ఎంఆర్.పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారం ఆరోగ్యకరం



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న భీమసింగి పాకలపాటి గురుదేవుల భక్తులు

చింతపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) శాకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని భీమ సింగి పాకలపాటి గురుదేవుల ఆశ్రమం భక్తులు దేవి, రజిత, బంగారమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాంసాహారం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. పాత బస్ స్టాండ్ వద్ద మానవహారం చేశారు. ఈసందర్భంగా ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాంసాహారం తీసుకోవడం వల్ల జీవ హింస చేయాల్సివస్తుందన్నారు. అలాగే పలు అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. శాఖాహారం వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రజలంతా శాకాహరు లుగా మారాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్తిబాబు, భక్తులు త్రిమూర్తులు, సింహాద్రి, పండు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏవో లీలావతి

హుకుంపేట జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ సాగు చేయాలని వ్య వసాయ శాఖ అధికారిణి లీలావతి సూచిం చారు బుధవారం మండలంలోని బారపల్లి పంచాయతీ నీలం పుట్టు గ్రామంలోని భారతీయ వ్యవసాయ పరిశోధన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్య క్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణ, వరిసాగు చేసే విధానాలను వివరించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేంద్రియ పద్ధతి లో పంటలు పండించడంతో ఆరోగ్యంతోపాటు ఆధిక దిగుబడి వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బం ది మోహన్, రైతులు ఉన్నారు.విచ్చలవిడిగా ఎరువులు వాడకంతో భూసారంపై ప్రభావం చూపి, పంట దిగుబడి తగ్గిపోతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సేంద్రియ సాగుతో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. ప్రభుత్వ సబ్సిడీ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మోహన్, రైతులు ఉన్నారు.

అనాథ మృతదేహానికి దహన సంస్కారాలు



భిక్షగాని మృతదేహం అంతిమక్రియల్లో పోలీసులు,

జి.మాడుగుల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సొలభం పంచాయతీ పరిధిలో భిక్షాటన చేస్తూ తిరిగే వ్యక్తి బుధవారం మృతి చెందారు. అతపి మృతదేహానికి స్థానిక సర్పంచ్ హనుమంతరావు చొరవతో బుధవారం పోలీసులు దహన సంస్కారాలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా సొలభం ప్రాం తంలో భిక్షాటన ఆ వ్యక్తి చేస్తూ జీవిస్తున్నారు. అయితే బుధవారం సొలభం శివారులో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి 108 వాహనానికి సమా చారమందించి పాడేరు ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మరణించినట్లు వైద్య సిబ్బం ది ధ్రువీకరించారు. దీంతో సర్పంచ్ హనుమంతరావు ఆర్థిక సాయంతో మృతదేహా న్నిమాడుగుల తీసుకువచ్చి దాహన సంస్కారాలు జరిపించారు.

కూటమి పాలనపై సానుకూలత

... 3వ పేజీ తరువాయి

తెచ్చుకునే వెసులుబాటు కల్పించడం ఎంతో బాగుందన్నారు. తుమ్మపాలకు చెందిన ఆటో డ్రైవర్ నంబూరు నాయుడు మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది మాత్రమే అయ్యిందని, మిగిలిన నాలుగేళ్లలో అన్ని హామీలను అమలు చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

అనకాపల్లి శారదానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యగుప్తా మాట్లాడుతూ... కూటమి ఏడాది పాలన బాగుందన్నారు. గతం ప్రభుత్వంలో ప్రజా సమస్యలపై పెద్దగా స్పందన ఉండేది కాదని, ముఖ్యంగా గ్రామాల్లో రహదారుల గురించి పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏడాది కాలంలోనే గ్రామీణ రోడ్లన్నీ బాగుపడ్డాయ న్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసే సమర్థత కూటమి ప్రభుత్వానికి ఉందని భావిస్తున్నానన్నారు. నర్సింగరావుపేటకు చెందిన చవితిని నూకరాజు మాట్లాడుతూ, అనకాపల్లి నూకాంబిక జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడం గొప్ప విషయమన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.4 వేలకు పెంచడంతో లక్షలాది మంది సంతోషంగా వున్నారని, అయితే సొంతింటి కల నెరవేర్చాలని పేదలు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. కొప్పాక గ్రామానికి చెందిన శ్రీనివాసరావు మాట్లా డుతూ, గత వైసీపీ పాలనతో పోల్చుకుంటే కూటమి పాలన బాగుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు వున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకొనేందుకు ప్రయ త్నాలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కృషి జరుగుతున్నదని, దీనివల్ల భవిష్యత్తులో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తా యన్నారు. శారదా కాలనీకి చెందిన రిక్షా కార్మికుడు అచ్చిబాబు మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించడం చాలా సంతోషంగా వుందన్నారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లాల్సిన పనిలేకుండా రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌కు వెళ్లి రూ.5తో కడుపు నిండా భోజనం చేస్తున్నట్టు చెప్పారు. తగరంపూడికి చెందిన రైతు పి.శ్రీను మాట్లా డుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాలకు మేలు చేసిందన్నారు. రైతు లకు సకాలంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు అందించారని, అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే పెట్టుబడి నిధులు అందిస్తుందని అన్నారు.

తహసీల్దార్ల బదిలీలు

... 3వ పేజీ తరువాయి

జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఆరుగురు డిప్యూటీ తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరితోపాటు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న, ఐదేళ్ల సర్వీసు పూర్తయిన 72 మంది డీటీలకు, వివిధ తహశీల్దారు కార్యాలయాల్లో పనిచేస్తున్న 38 మంది సీనియర్ అసిస్టెంట్లు, 13 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు టైపిస్టులను వివిధ మండలాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీఎం రాక రేపు

... 3వ పేజీ తరువాయి

నుంచి 11.20 గంటలకు నోవాటెల్ హోటల్‌కు చేరుకుని, మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రెన్యుబుల్ ఎనర్జీపై జరిగే ప్రాంతీయ వర్క్‌షాపులో పాల్గొంటారు. ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ హోటల్‌లో ఉండి, రెండు నుంచి సాయంత్రం నాలుగు గం టల వరకూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలపై సమీక్ష నిర్వహిస్తారు. సాయం త్రం నాలుగు గంటలకు హోటల్ నుంచి బయలుదేరి 4.10 గంటలకు సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనం వద్దకు చేరుకుని దానిని ప్రారంభిస్తారు. అందు లోనే ఏర్పాటవుతున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను కూడా ప్రారంభించి విద్యార్థులు, ఔ త్సాహికులు, స్టార్టప్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం 4.50 గంటల కు బయలుదేరి సమీపంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాకు వెళతారు. ఆరు గంటల వర కూ పలు పరిశ్రమలకు సంబంధించిన శిలాఫలకాలు ఆవిష్కరిస్తారు. అక్కడే పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి నిర్వహించి, తరువాత వర్చువల్‌గా ప్రజలనుద్దేశించి మాట్లాడతా రు. అక్కడ నుంచి ఆరు గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని 6.30 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు. ఆయా ప్రాంగణాలు, వేదికలను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత కలిసి బుధవారం పరిశీలించారు. కొన్ని అత్యవసర పను లు వెంటనే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ ప్రారంభం

- తొలిరోజు 300 మందికి స్థానచలనం
- నేడు 301 నుంచి 800 వరకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ కోసం వేచి ఉన్న ఉపాధ్యాయులు

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):

సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీల) బదిలీ కౌన్సెలింగ్ బుధవారం మధ్యాహ్నం ప్రారంభ మైంది. జడ్పీ సమావేశమందిరంలో ప్రారంభమైన కౌన్సెలింగ్ విశాఖ జిల్లా విద్యాశాఖాధి కారి ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షణలో కొనసాగింది. బదిలీలకు సంబంధించి ఎస్జీటీలతో రూపొందించిన సీనియారిటీ జాబితాలో ఒకటి నుంచి 300 వరకు టీచర్లకు బదిలీ చేశా రు. ప్రతి టీచర్‌ను పిలిచి వారికి కొన్ని స్కూళ్ల వివరాలు చూపిస్తున్నారు. దాంట్లో ఆప్షన్ చేసుకునే స్కూల్‌కు బదిలీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ బుధవారం రాత్రి 10.30 గంటల వ రకు కొనసాగింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ మేరకు మంగళవారం ప్రారంభంకా వాలి. అయితే సాంకేతిక సమస్య కారణంగా కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా వేశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించారు. గురువారం సీనియా రిటీ జాబితాలో 301 నుంచి 800 వరకు అంటే 500 మందికి బదిలీలు నిర్వహిస్తారు.

బదిలీ టీచర్లకు ఆన్‌డ్యూటీ సౌకర్యం

గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నిబంధనల మేరకు ప్రతి టీ చర్ పునఃప్రారంభం రోజున విధిగా స్కూల్‌కు హాజరుకావాలి. అయితే గురువారం నిర్వ హించనున్న బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే టీచర్లకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించారు. ఒకవేళ ఒక స్కూల్‌లో ఇద్దరు టీచర్లు కౌన్సెలింగ్‌కు వస్తే సమీపంలోని పాఠశాలలో పని చేసే ఎంటీఎస్ టీచర్‌కు సదరు పాఠశాల నిర్వహణ బాధ్యత అప్పగించాలి. ఈ విషయా న్ని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

జనరంజక పాలన



కూటమి ప్రభుత్వ పనితీరుపై వివిధ వర్గాల మనోగతం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై వివిధ వర్గాలు సానుకూలంగా స్పందించాయి. పరిపాలన గాడిలో పడిందని, వివిధ వర్గాలకు మేలు చేకూరుతోందని సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి మరింత చేయూత, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి నిలపడం, మిగిలిపోయిన పేద వర్గాలకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేయడం అవసరమని సూచించారు. పాలనపై ఎవరు ఏమన్నారంటే....



రోడ్లు బాగుపడ్డాయి... ఇక్కట్లు తొలగాయి

గత ప్రభుత్వంలో రోడ్లు ఎంత దారుణంగా వున్నాయో అందరికీ తెలిసిందే. రిక్షా తొక్కడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. విడిభాగాలు తరచూ పాడూపోయేవి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను బాగు చేస్తామని చెప్పడమే కాకుండా ఆచరణలో అమలు చేశారు. ఇప్పుడు సాఫీగా రిక్షాలు తొక్కగలుగుతున్నాం. సీఎం చంద్రబాబు ప్రజలకు నిరంతరం సేవలందించాలనే ఉద్దేశంతో చక్కటి పరిపాలన సాగిస్తున్నారు.

- నొట్ల అప్పారావు, రిక్షా కార్మికుడు, అనకాపల్లి



వ్యాపారులకు ఇబ్బందులు లేవు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు కలగలేదని భావిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఎప్పుడు, ఎటువంటి ఆంక్షలు విధిస్తారోనని ఆందోళనగా ఉండేది. ఇప్పుడు ప్రశాంతంగా వ్యాపారం చేసుకుంటున్నాం. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతున్నాయి. గతంలో కిలో రూ.160 ఉన్న కందిపప్పు ప్రస్తుతం రూ.100కి దిగివచ్చింది. మొత్తం మీద కూటమి ఏడాది పాలన చాలా బాగుంది.

- శ్రీధరాల సోమరాజు, హోల్‌సేల్ కిరాణా వ్యాపారి, అనకాపల్లి



పరిశ్రమల రాకతో ఉపాధి, ఉద్యోగాలు

గత వైసీపీ ప్రభుత్వంతో పోల్చితే కూటమి ప్రభుత్వ పరిపాలన బాగుంది. నిత్యావసర సరుకుల ధరలు కొంతమేర తగ్గాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కోసం తరచూ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం. దీనివల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

- ఎన్.శివ, ప్రైవేటు ఉద్యోగి, గొల్లపేట, అనకాపల్లి మండలం



తల్లికి వందనం కోసం ఆత్రుతగా ఉన్నాం

కళాసీగా పని చేస్తున్నాను. మా పిల్లలు ఇద్దరూ హైస్కూల్ చదువుతున్నారు. ఈ ఏడాది తల్లికి వందనం పథకం వస్తుందని ఆతృతగా ఎదురు చూస్తున్నాం. ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు పథకం కింద బ్యాంకు ఖాతాలకు డబ్బులు పడినప్పటికీ, మాకు మాత్రం ఇంకా వంట గ్యాస్ సబ్సిడీ పడలేదు. ప్రభుత్వం ఆర్టీసీ ఉచిత బస్సు పథకం కూడా త్వరగా ప్రారంభిస్తే బాగుంటుంది.

- బొబ్బాది అప్పారావు, దినసరి కూలీ, గాంధీగ్రామం, చోడవరం మండలం



కూటమి పాలన బాగుంది

డ్వాక్రా మహిళలకు రుణం మంజూరైన తరువాత ఒక్కో సభ్యురాలికి ఎంత వస్తుందో ముందుగానే చెప్పి, బయోమెట్రిక్ తీసుకున్న తరువాత ఖాతాలో రుణం డబ్బులు వేస్తున్నారు. ఈ విధానం చాలా బాగుంది. గతంలో గోతులు పడిన రోడ్లను బాగు చేస్తున్నారు. ఇంట్లో చదివే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ అమ్మకు వందనం పథకం అమలు చేస్తామని చెప్పడమేకాకుండా.. రేపు (గురువారం) డబ్బులు వేస్తామని చెప్పడం ఆనందంగా వుంది. కూటమి పరిపాలన బాగుంది.

- బొడ్డేటి ఆదియ్యమ్మ, గృహిణి, మాడుగుల



కష్టకాలంలో హామీలు నెరవేర్చడం గొప్ప విషయం

రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిన సమయంలో పాలన పగ్గాలు చేపట్టిన సీఎం చంద్రబాబునాయుడు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం గొప్ప విషయం. ఎన్నాళ్ల నుంచో నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడి, పోటీ పరీక్షలు కూడా జరుగుతున్నాయి. రాజధాని అమరావతి నిర్మాణ పనులు మొదలు కావడం సంతోషం. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రభుత్వం ద్వారా ఏదో ఒక సాయం అందుతున్నది. రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్న నమ్మకం ప్రజలకు ఏర్పడింది.

- వై.గుణశేఖర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, గొడిచెర్ల, నక్కపల్లి మండలం



'ఆదరణ' పథకాన్ని పునరుద్ధరించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ పాలన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం. ఉపాధ్యాయ నిరుద్యోగుల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్వ విధానంలో రేషన్ పంపిణీ చాలా మంచి నిర్ణయం. బీసీ కుల వృత్తుల వారికి 'ఆదరణ' పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతున్నాను.

- కొత్తలి చిన్నారావు, లాండ్రీ దుకాణం, ఏఎస్ఆర్ కాలనీ, ఎలమంచిలి



పావలా వడ్డీ రుణాలు కొనసాగించాలి

కూటమి ప్రభుత్వం పాలన బాగానే ఉంది. వలంటీర్లు లేకపోయినప్పటికీ ప్రతి నెలా ఒకటో తేదీన ఇళ్లకు వచ్చిన పింఛన్ డబ్బులు ఇవ్వడం సంతోషం. తల్లికి వందనం పథకాన్ని పిల్లలందరికీ అమలు చేయడం బాగుంది. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు కొనసాగించాలి. 50 ఏళ్లలోపు ఒంటరి మహిళలకు కూడా పింఛన్ మంజూరు చేయాలి.

- చలపాక వెంకటలక్ష్మి, బీసీ కాలనీ, నర్సీపట్నం



రైతుల్లో కొంత అసంతృప్తి ఉంది

కూటమి ప్రభుత్వం ఏడాదిలో రైతులకు చేసింది ఏమీ లేదు. ఇంతవరకు వరి విత్తనాలు అందజేయలేదు. పచ్చిరొట్ట విత్తనాలు మాత్రమే ఇచ్చారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా మార్చిందే తప్ప, ఒక్క విడత కూడా డబ్బులు ఇవ్వలేదు. ఈ కారణాల వల్ల కూటమి ప్రభుత్వంపై రైతుల్లో కొంత అసంతృప్తి ఉంది.

- రుత్తల సత్యనారాయణ, రైతు, రాచపల్లి, మాకవరపాలెం మండలం

డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు సీపీఎం నేతల వినతి



స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో మాట్లాడుతున్న సీపీఎం నేత నరసింగరావు

నర్సీపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నరసింగరావు కోరారు. బుధవారం అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడును నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వాటిని పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకనాథం, సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, విశాఖ డెయిరీ యూనియన్ నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా సిబ్బంది సమస్యలపై...

మునిసిపాలిటీ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. రూ.13,087 వేతనంతో పని చేస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్‌లు పోను చేతికి అందిన డబ్బులతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని తెలిపారు. గత ఐదేళ్లు తమకు వేతనాలు పెరగలేదని చెప్పారు.

విద్యార్థులను అభినందించిన స్పీకర్

ఎంసెట్ ఫలితాలలో ర్యాంకులు సాధించిన ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు. ఎంసెట్ ప్రవేశ పరీక్షల ఫలితాలలో వరుసగా 2,561, 8,033, 10,716 ర్యాంకులు సాధించిన కె.శివకుమార్, శ్రీమనోజ్ఞ, బి.సాయిలక్ష్మీదీప్తిలను బుధవారం క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అభినందించారు. ఇంజనీరింగ్‌లో బాగా చదువుకొని నర్సీపట్నానికి మంచి పేరు తీసుకురావలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ యు.సత్తిబాబు, ప్రిన్సిపాల్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సోదరుడికి సినీ దర్శకుడు గుణశేఖర్ నివాళులు



సోదరుడి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గుణశేఖర్

నర్సీపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు గుణశేఖర్ నర్సీపట్నంలో తన సోదరుడు కర్రి దుర్గా ప్రసాద్ సంతాప సభలో పాల్గొని నివాళులర్పించారు. పట్టణంలోని రామ చంద్ర పంక్షన్ హాలులో బుధవారం సంతాప సభ జరిగింది. దుర్గాప్రసాద్ కిరాణా జనరల్ మర్చంట్స్ అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ఈ నెల 1వ అనారోగ్యంతో మరణించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గణేశ్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సన్యాసిపాత్రుడు, అయ్యరక సంక్షేమ సంఘం నాయకులు పి.రాజశేఖర్, డి.వెంకటరమణ, లంక రామన్నపాత్రుడు, ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు పి.జోగారావు, వ్యాపార, వర్తక సంఘం నాయకులు కర్రి రాంగోపాల్, కర్రి ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

చోడవరంలో అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు బుధవారం శంకుస్థాపన రుూ౦డ్చుజుజీ. కార్యక్రమంలో ఎంపీడీవో అంజనేయులు, పంచాయతీ ఈవో నారాయణరావు, టీడీపీ నేతలు గూనూరు మల్లునాయుడు, కనిశెట్టి మత్స్యరాజు, ఎస్.రమేశ్, గూనూరు మూలినాయుడు, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ భవనానికి..

అనంతరం స్థానిక తహసీల్దార్ భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే రాజు శంకుస్థాపన నిర్వహించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన రెవెన్యూ భవనానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఈ మేరకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేపట్టారు. అలాగే రూ.కోటి వ్యయంతో నిర్మించిన పీఎస్‌పేట రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు.

అన్నదాతలకు ప్రభుత్వం అండ

లక్ష్మీపురంలో గ్రామంలో బుధవారం ఏరువాక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి పావని, టీడీపీ, జనసేన నాయకులు కనిశెట్టి మత్స్యరాజు, సిరిపురపు రమేశ్, సకురు కోటేశ్వరరావు, లక్ష్మీపురం రైతులు పాల్గొన్నారు.

అధికారుల తీరు సభ్యుల మండిపాటు

రైతు సేవా కేంద్రాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని అసహనం

కె.కోటపాడు మండల సర్వసభ్య సమావేశం

కె.కోటపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాతవలస, చౌడువాడ ఎంపీటీసీ సభ్యులు వర్రి రామనాయుడు, ఏటుకూరు రాజేశ్, ఆర్.సూర్యనారాయణ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల భవనాలను అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంట్రాక్టర్ కొన్ని భవనాలకు సదుపాయాలు కల్పించాల్సి ఉందని ఏఈ సోమశేఖర్ బదులిచ్చారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో విద్యుత్ సిబ్బంది లేకపోవడంతో విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలు పడుతున్నారని, వెంటనే విద్యుత్‌శాఖలో ఉన్న ఖాళీలు భర్తీ చేయాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ విద్యుత్ అధికారులకు ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌ల గౌరవ వేతనం నిధులు విడుదలకు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియపరచాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

రోలుగుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 పంచాయతీల్లో 55 ప్రభుత్వ పాఠశాలలకు శతశాతం పాఠ్య పుస్తకాలు చేరాయని ఎంఈవో జాన్‌ప్రసాద్ తెలిపారు. 55 పాఠశాలల్లో 2387 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. వారికి సంబంధించి పాఠ్య పుస్తకాలు-12433, డిక్షనరీలు-231, యూనిఫారాలు-2387, నోట్ పుస్తకాలు-15640, బెల్ట్‌లు-1549 వచ్చినట్టు ఆయన తెలిపారు. ఇంకా విద్యార్థులకు సంబంధించి బూట్లు, బ్యాగులు మాత్రమే రావాల్సి ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో అవి కూడా వస్తాయన్నారు. గురువారం పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందిస్తామని ఆయన తెలిపారు.

విశాఖలో రోడ్డు ప్రమాదం

భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం

విశాఖపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపంలో ఇసుకకొండ సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ కుటుంబం రోడ్డు ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, భర్త తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం పరిధిలోని బుచ్చెయ్యపేటలో ఆర్.శివపురం ప్రాంతానికి చెందిన దేవర చిలకనాయుడు, అతని భార్య కృష్ణకుమారి సుమారు ఏడాది వయసు ఉన్న కుమార్తెతో కలిసి ఇసుకకొండ స్వామి దర్శనానికి వచ్చారు. చిలకనాయుడు దివ్యాంగుడు కావడంతో తన మూడు చక్రాల వాహనంపై వచ్చారు. ఉదయం 10.30 గంటల సమయానికి దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఘాట్‌రోడ్డు దిగుతూ వాహనంపై వేగంగా వస్తున్నారు. వేగం తగ్గించమని అతని భార్య కృష్ణకుమారి హెచ్చరిస్తుండగానే, మలుపులో వాహనాన్ని అదుపు చేయలేక నేరుగా వెళ్లి గోడను బలంగా ఢీకొట్టాడు. దీంతో కృష్ణకుమారి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, చిలకనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలో ఉన్నవారు అతడిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. వారి కుమార్తె మాత్రం క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడింది. చిలకనాయుడు పరిస్థితి విషమంగా ఉంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

లక్ష్మీపురంలో తాగునీటి సమస్యకు పరిష్కారం

చోడవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో లోవోల్టేజీ సమస్యల వల్ల తాగునీటి పథకాల మోటార్లు కాలిపోయి నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈపీడీసీఎల్ జేఈ రాజు ఆధ్వర్యంలో గ్రామంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం మార్చారు. విద్యుత్ సమస్య మెరుగుపడడంతో తాగునీటి పథకాలకు నీటి సరఫరా మొదలైంది. సమస్య పరిష్కారం కావడంపై సర్పంచ్ గంగాభవానీ హర్షం వ్యక్తం చేశారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో వినాశనం

గొలుగొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగంతో కుటుంబాలను వినాశనమవుతాయని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ చెప్పారు. మండలంలోని పాకలపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గంజాయి రవాణాతో విద్యార్థులు, అమాయకులు బలైపోతున్నారని చెప్పారు. బాలలపై అఘాయిత్యాలు, సైబర్ నేరాలు వంటి జోలికిపోకూడద ని సూచించారు. కార్యక్రమంలో స్థానిక రామారావు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోవాలి

నాతవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు పెంచుకోవడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీవో కొండాజీ కోరారు. ఎకర భూమిలో మామిడి, జీడితోటలు, సపోట తదితర తోటలు పెంచుకునే రైతులకు ప్రభుత్వం మొక్కలు, సేంద్రియ ఎరువులు, తోటల సంరక్షణకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఈ పథకానికి రైతులు తప్పనిసరిగా జాబ్ కార్డు కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం

మాడుగుల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం జంక్షన్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి 15 వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బుధవారం స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భోజన బిల్లు బకాయిలు చెల్లించాలి

చోడవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బాలికల హైస్కూల్‌లో నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు తెరుస్తున్నా పూర్తి స్థాయిలో బకాయిలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. సంఘ సభ్యులు అమ్మాజీ, ఉమ, నాగమణి, వరలక్ష్మి, దేవుడమ్మ, ఘుచ్చిరాజమ్మ, సత్యవతి, దేవి పాల్గొన్నారు.

లింగపేటలో చోరీ సొత్తు స్వాధీనం

గొలుగొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగపేట గ్రామంలో ఈ నెల 9వ తేదీన జరిగిన చోరీ కేసు ఛేదించామని ఎస్ఐ తారకేశ్వరరావు బుధవారం తెలిపారు. గ్రామంలో బొద్దేపు అప్పలనాయుడు ఇంటిలో బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అదే గ్రామానికి చెందిన గుల్లింగల చిన్నమ్మలను అదుపులోకి తీసుకుని విచారించి, ఆమె నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశామన్నారు. కేసు నమోదు చేసి ఆమెను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

అద్దె కార్ల తనఖా ముఠా గుట్టు రట్టు

బుచ్చెయ్యపేట, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): అద్దెకు తీసుకున్న కార్లను తనఖా పెడుతున్న ముఠా గుట్టు రట్టయింది. తెలంగాణలో కొంత మంది ముఠాగా ఏర్పడి కార్లను అద్దెకు తీసుకుని తనఖాలు పెట్టారు. ఆ ముఠాతో మండలంలోని దిబ్బిడ్డి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు పరిచయం ఏర్పడింది. వీరంతా కార్లను అద్దెకు తీసుకుని తనఖాలు పెట్టి, ఆ మొత్తాన్ని వడ్డీలకు తిప్పుతున్నారు. అయితే ఎప్పటికప్పుడు కార్ల అద్దె చెల్లిస్తుండడంతో యజమానులకు అనుమానం రాలేదు. తాజాగా అద్దె చెల్లించకపోవడం, సదరు ముఠా అడ్రస్ లేకపోవడంతో యజమానులకు అనుమానం వచ్చి జీపీఎస్ ఆధారంగా కార్లు దిబ్బిడిలో ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఇక్కడి పోలీసుల సహకారంతో బుచ్చెయ్యపేట, దిబ్బిడి గ్రామాల్లో 35 కార్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కాగా, తనఖా పట్టి వారు ఇప్పుడు కార్లు తీసుకుపోవడంతో డబ్బుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. ఇద్దరు యువకుల్లో ఒకరు ప్రజాప్రతినిధి కుమారుడు కావడంతో, వారి ఇంటి వద్ద పంచాయితీ జరుగుతోంది.

చెరకు రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

మాజీ మంత్రి అమర్‌నాథ్



ఏడువాక సత్యారావుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్

చోడవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతుల బకాయిలు చెల్లించడంతో పాటు వారి సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని మాజీ మంత్రి గుడివాడ అమర్ డిమాండ్ చేశారు. బుధవారం గోవాడలో వైసీపీ నాయకుడు ఏడువాక సత్యారావు గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గోవాడ ఫ్యాక్టరీ పరిస్థితిపై ప్రభుత్వం స్పందన కోసం వేచి చూస్తున్నామన్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన సత్యారావును పరామర్శించిన అమర్, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల స్థాయి ముఖ్య నాయకులతో సమావేశమైన ఆయన, ఈ నెల 22న పార్టీ మండల సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైసీపీ నాయకులు పల్లా నరసింగరావు, పుల్లేటి వెంకటేశ్, బైన ఈశ్వరరావు, కోన చంద్రరావు, శరగడం నాగేశ్వరరావు, నెహ్రూ, దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.